ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





జోలదరాశి సమీపంలోని కుందూనది

అతీగతి లేని రాజోలి, జోలదరాశి

గత వైసీపీ ప్రభుత్వం కొన్ని నీటి పథకాలకు శంకుస్థాపన చేసి వదిలేసింది. ప్రజా సంక్షేమంపై చిత్తశుద్ధి లేకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. అలాంటి పథకాలే జోలదరాసి, రాజోలి రిజర్వాయర్లు. నంద్యాల జిల్లా చాగలమర్రిలోని కుందూనదిపై నిర్మించతలపెట్టిన రాజోలు, జోలదరాశి రిజర్వాయర్ల పనులు నిధులు లేక భూమి పూజతో ముగిసిపోయాయి. ఈ రిజర్వాయర్ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పనులు కూడా పూర్తి కాలేదు. అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన ఈ ప్రాజెక్టులతోపాటు రాయలసీమలోని మిగతా ప్రాజెక్టులు కూడా ఒక్క అడుగు ముందుకు వేయలేదు.

- భూమి పూజ దగ్గరే ఆపేసిన గత వైసీపీ ప్రభుత్వం
- ముందుకు సాగని ప్రాజెక్టుల పనులు
- పూర్తికాని భూసేకరణ

బనగానపల్లె/కోవెలకుంట్ల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ పేరుతో గత వైసీపీ ప్రభుత్వం 23 ప్రాజెక్టులు చేపట్టింది. నిధుల్లేకున్నా అట్టహాసంగా టెండర్లను పిలిచింది. ఈ 23 ప్రాజెక్టులలో కుందూనదిపై కోవెలకుంట్ల సమీపంలో జోలదరాశి రిజర్వాయర్, చాగలమర్రిలో రాజోలి రిజర్వాయర్, కడప జిల్లాలో బ్రహ్మసాగర్ ఎత్తిపోతల పథకాలకు రూ.2600 కోట్లతో మూడు ప్రాజెక్టులకు ఒకేసారి 2019 డిసెంబరు నెల 23వ తేదీన అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చాగలమర్రి మండలం దువ్వూరు మండలం నేలటూరులో శంకుస్థాపన చేశారు. మూడేళ్లలో జోలదరాశి, రాజోలి రిజర్వాయర్లను పూర్తి చేస్తామని సీఎం మాట ఇచ్చారు. జోలదరాశి, రాజోలి రిజర్వాయర్లను రూ. 1758 కోట్లతో నిర్మిస్తామని అన్నారు. 0.8 టీఎంసీ నీరు నిలువ ఉండేలా జోలదరాశి రిజర్వాయరుకు ప్రణాళిక సిద్ధం చేశారు. దీని వల్ల 2500 ఎకరాలు మునిగిపోనుంది. చాగలమర్రి సమీపంలోని 2.98 టీఎంసీల సామర్థ్యంతో తలపెట్టిన రాజోలి రిజర్వాయర్ కింద 766 ఎకరాలు మునిగిపోతుందని అంచనా వేశారు. ఇందులో చాగలమర్రి మండలం గొట్లూరులో 350 ఎకరాలు, రాజోలిలో 416 ఎకరాలు రైతుల నుంచి సేకరించారు. ఎకరాకు 12.50 లక్షల నష్టపరిహారం అందిస్తామన్నారు. కాని వైసీపీ ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదు. దీనితో ఈ పథకం ద్వారా కోవెలకుంట్ల మండలంలో సాగు నీటితో పాటు తాగునీటి సమస్య తీరుస్తామనే హామీ అమలులోకి రాలేదు.

జోలదరాశి రిజర్వాయరు

కోవెలకుంట్ల మండలం జోలదరాశి సమీపంలో కుందూనదిపై నిర్మించతలపెట్టిన ఈ పథకం ద్వారా బనగానపల్లె నియోజకవర్గంలో తాగు, సాగునీటిని అందించడం లక్ష్యం. దీనికి 2,465 ఎకరాల భూమి అవసరమని అధికారులు తేల్చారు. భూసేకరణకు ప్రభుత్వం రూ.369 కోట్లు కేటాయించింది. ఎంఆర్‌కెఆర్, రుత్విక్ కంపెనీలు సంయుక్తంగా టెండర్లను దక్కించుకున్నాయి. శంకుస్థాపన చేసి 6 సంవత్సరాలు పూర్తయినా రిజర్వాయరు పనులు ముందుకు సాగడం లేదు. కనీసం భూ సర్వే పనులు కూడా పూర్తి కాలేదు. తొలి విడతలో 338.15 ఎకరాల పట్టా భూమి, 128 ఎకరాలు చుక్కలు అసైన్డ్ భూములు సేకరించారు. కాని నష్టపరిహారం అందించలేదు. కోవెలకుంట్ల మండలంలోని చింతకుంట, వెలగటూరు, జోలదరాశి, గోవిందిన్నె, కలుగొట్ల గ్రామాల పరిధిలో భూములను సేకరించాల్సి ఉంది. మొదటి దశలో జోలదరాశి, వెలగటూరు, చింతకుంట, కలుగొట్ల, గ్రామాల్లో 338.15 ఎకరాలు రిజర్వాయరు మునకలో పోతాయని సర్వే ద్వారా అధికారులు గుర్తించారు. రెండో దశ కింద 311.94 ఎకరాలు మునకలో పోనున్నట్లు సర్వేలో అధికారులు గుర్తించారు. ఇక మూడో విడత సర్వే పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ప్రభుత్వం ఎకరాకు రూ.11.50 లక్షలు పంట నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పింది. కాని ఇవ్వలేదు.



జోలదరాశి బోర్డు

మిగతా 6వ పేజీలో..

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

- స్కిల్ హబ్ కమిటీలకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయండి: కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి అవకాశాలను కల్పించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ రాజకుమారి ˇ అధికారులను ఆదేశించారు. బుధవార కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. జిల్లా పరిశ్రమల మేనేజర్ జవహర్‌బాబు, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ రవీంద్రకుమార్, డీఆర్డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు సృష్టించే పారిశ్రామిక రంగ అభివృద్ధికి ముం దుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి నూతన పరిశ్రమల ఏర్పాటుకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని ˇ అధికారులను ఆదేశించారు.

- స్కిల్ కమిటీకు కేటాయించిన లక్ష్యాలను సాధించండి: జిల్లాలో స్కిల్ హబ్స్, స్కిల్ కాలేజ్ ట్రైనింగ్స్, జాబ్ మేళాలకు కేటాయించిన లక్ష్యాలను పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్కిల్ కమిటీ సభ్యులందరూ జిల్లాలో ఉన్న పారిశ్రామిక యూనిట్లలో ఇచ్చిన శిక్షణల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఏపీ ఎస్ఎఫ్ఎస్ బ్రాంచ్ మేనేజర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నియంత్రించండి

జిల్లాలో మాదక ద్రవ్యాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మాదక ద్రవ్యాల జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ మందజావలి ఆల్ఫోన్సా, డీఆర్‌ఓ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ యువత, ,విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై పాఠశాలల్లో, కళాశాలల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సెబ్ సూపరింటెండెంట్, నంద్యాల, ఆత్మకూరు ఆర్డీఓలు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయంలో 853.8 అడుగుల నీటి మట్టం



శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 29(ఆంధ్రజ్యోతి): శ్రీశైల జలాశయంలో బుధవారం సాయంత్రం 6గంటల సమయానికి 853.8 అడుగుల నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్ట్ గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 853.8 అడుగుల నీటిమట్టానికి చేరుకుంది. అదే క్రమంలో ప్రాజెక్ట్ గరిష్ఠ నీటినిల్వలు 215.8070 టీఎంసీలకుగాను ప్రస్తుతం 88.6777 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. కాగా ప్రాజెక్ట్ నుంచి తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి 35,315 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఇదిలా వుంటే ఉదయం 6 గంటలకు తెలంగాణ పవర్ హౌస్ 7770 క్యూసెక్కులు, హంద్రీ నీవాకు 1630 క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు 2400 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడుకు 2500 క్యూసెక్కులు, నీటి ఆవిరి రూపంలో 233 క్యూసెక్కుల నీటిని వినియోగించారు. అయితే సాయంత్రానికి తెలంగాణ పవర్ హౌస్‌కు నీటివిడుదల 35,315 క్యూసెక్కుల నీటిని పెంచి మిగతా ప్రాజెక్ట్‌లకు నీటినిల్వలను పూర్తిగా నిలిపివేశారు.

ఏపీని అప్పులపాలు చేసిన జగన్

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ఏపీని అప్పులపాలు చేసిందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. బీసీ మాట్లాడుతూ గత ఏడు నెలల్లో ఆరోగ్య శ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లాంటి గత జగన్ ప్రభుత్వం బకాయిలు రూ.22 వేల కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఏపీకి అప్పులు కూడా పుట్టని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏడాదికి రూ.71 వేల కోట్ల అసలు, వడ్డీ చెల్లించాలని ఇది చంద్రబాబు ప్రభుత్వానికి గుది బండలా మారిందన్నారు. వైసీపీ చేసిన పాపాలు ఎన్‌డీఏ ప్రభుత్వానికి చుట్టుకున్నాయని విమర్శించారు. భూకేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్ అనుమతులు, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, తదితర వాటి ద్వారా ఆశ్రిత పక్షపాతానికి ఒడిగట్టి కోట్ల సంపాదించారని విమర్శించారు. ఈ దోపిడీ వల్ల, ప్రజాధనం దుర్వినియోగం వల్ల ఏపీ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దివాళా తీసిందన్నారు. ఈ అప్పులు ఏపికి గుది బండలా తయారయ్యాయన్నారు. వైసీపీ 5 ఏళ్ల పాలన ప్రజల పాలిట శాపంగా మారిందని బీసీ విమర్శించారు.

తండ్రీ కొడుకుల దుర్మరణం

- భార్యకు తీవ్ర గాయాలు
- చెన్నాపురం వద్ద బైకును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

7



రోదిస్తున్న కుటుంబ సభ్యులు



మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



క్రీడాకారులతో క్రీడాశాఖ మంత్రి

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ఫైరింగ్ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

నంద్యాల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని రామకృష్ణ వీజీ కళాశాల క్రీడా మైదానంలో 28వ జూనియర్ జాతీయ స్థాయి సెపక్ తక్రా చాంపియన్‌షిప్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో క్రీడలను ప్రోత్సహించేలా సీఎం చంద్రబాబు నూతనంగా క్రీడా పాలసీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ క్రీడలను ప్రభుత్వంతో పాటు ప్రోత్సహిస్తున్న పలు క్రీడా సంఘాలను అభినందించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగ అవకాశాల్లో క్రీడాకారులకు 2 నుంచి 3 శాతం రిజర్వేషన్ పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అమరావతిలో వివిధ జాతీయ క్రీడలను నిర్వహించడం కోసం క్రీడా మైదానాలు ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ మాట్లాడుతూ.. రాష్ట్ర జాతీయ పోటీలలో నంద్యాల నుంచి క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయ మన్నారు. పద్మావతి నగర్‌లో ఏర్పాటు చేసిన క్రీడాప్రాధికార సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రిని కోరారు. క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేసి ఫైరింగ్ చేశారు.కార్యక్రమంలో రాష్ట్ర సెపక్ తక్రా సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, క్రీడా పాలసీ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు రామకృష్ణారెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి ఐశ్వర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసీరెడ్డి, గురురాజా విద్యా సంస్థల చైర్మన్ దస్తగిరిరెడ్డి, క్రీడాపాలసీ జిల్లా అధ్యక్షులు సుధాకర్, కార్యదర్శి నిమ్మకాయల సుధాకర్, డీఎస్‌డీవో రాజు, రాష్ట్ర పీడీ సంఘం అధ్యక్షులు ఏవీరెడ్డి, నాగరాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు



ముస్తాబైన ఉరుకుంద క్షేత్రం



రంగురంగులతో సుందరంగా తయారైన ఆలయ గోపురాలు

- మహా కుంభాభిషేక ఉత్సవాలకు ఏర్పాట్లు
- భక్తులకు సౌకర్యాల కల్పనలో ఆలయ అధికారులు

కౌతాళం, జనవరి 29(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఉరకుంద ఈరన్న స్వామి దేవాలయంలో ఫిబ్రవరి 1, 2, 3వ తేదీలలో జరిగే మహాకుంభాభిషేక ఉత్సవాలకు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఏడాది శ్రావణ మాసం, కార్తీక మాసంలో ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయి. ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి కుంభోత్సవాలు జరపడం విశేషం. ఈ ప్రాధాన్యత రీత్యా భక్తులు పెద్ద ఎత్తున కౌతాళం రానున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. ఈ ఉత్సవాల నిర్వహణకు ఆలయ అధికారులు, ఆలయ సిబ్బంది ఆలయ ఈఓతో పనుల్లో నిమగ్నమయ్యారు.

ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు:

రాజగోపురంతో పాటు నూతనంగా నిర్మించిన 4 గోపురాలకు రంగులు వేశారు. ఈ గోపురాలపై దాతల సహకారంతో కలశాలను తయారు చేయించి ప్రతిష్టిస్తున్నట్లు ఈవో తెలిపారు. ఉత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తులకు విడిది కోసం కర్ణాటకకు చెందిన ఓ భక్తుడు 50లక్షలతో షెడ్లను నిర్మించారు. రాత్రి సమయాలలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఐమాక్స్ లైట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. స్వామి వారి అన్నదాన సత్రంలో వేల సంఖ్యలో భక్తులు భోజనం చేసే అవకాశం ఉండటంతో సత్రంలో మెరుగైన వసతులు కల్పిస్తున్నారు. మాడ వీధుల్లో స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నారు.



నిత్యం పూజలందుకుంటున్న స్వామి వారి మూలవిరాట్

వివిధ మఠాల పీఠాధిపతుల రాక

మహా కుంభాభిషేకానికి వివిధ మఠాల పీఠాధిపతులు హాజరవుతున్నారు. కంచి కామకోటి పీఠం పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి, పుష్పగిరి మఠం పీఠాధిపతి విద్యాన్సింహ భారతి స్వామి, శ్రీశైల పీఠాధిపతి శ్రీచెన్న సిద్ధరామ శివాచార్య స్వామి, మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామి, హల్వి పీఠాధిపతి మహంతేష్ స్వామి హాజరవుతున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు.

ప్రముఖులకు ఆహ్వానం:

ఈ మహాకుంభాభిషేక ఉత్సవాలకు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ సత్య నారాయణ, రాష్ట్ర ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామనాయుడు, మంత్రులు టీజీ భరత్, ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయకుడు, నాయకులు తిక్కారెడ్డి, పలువురు అధికారులను ఆహ్వానించినట్లు ఈఓ తెలిపారు.

ప్రత్యేక కార్యక్రమాలు

మహా కుంభాభిషేకంలో భాగంగా ఆలయం వద్ద ఫిబ్రవరి 1,2,3వ తేదీలలో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఇప్పటికే పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. రాజగోపురంతో పాటు తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ గోపురాలను అలంకరించనున్నారు. నవగ్రహాల మంటపం, గణపతి విగ్రహ ప్రతిష్టాపన, హోమాల నిర్వహణకు ప్రత్యేక గదులు నిర్మిస్తున్నారు. చివరి రోజు కలశాల ప్రతిష్టాపనకు కర్ణాటక భక్తుడు ఒకరు హెలికాప్టర్ ద్వారా పూల వర్షం కురిపిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. దాతల సహకారంతో మునుపెన్నడు చూడని రీతిలో ఆలయం వద్ద వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.



హోమాల నిర్వహణకు తాటాకులతో నిర్మించిన యాగశాల



కలశాల ఏర్పాటుకు గోపురాలకు ఏర్పాటు చేసిన మెట్లు

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి పిలుపునిచ్చారు. పర్యావరణం, నీటి వనరుల పరిరక్షణపై బుధవారం స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో జరిగిన ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటే ముందుతరాల వారికి మంచి జీవితాన్ని ఇచ్చిన వారమవుతామని ఆయన తెలిపారు. నీటి వనరుల పరిరక్షణపై, కాలుష్య నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. కర్నూలు కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మాట్లాడుతూ కార్పొరేషన్ సిబ్బంది కర్నూలు నగరంలో ఉన్న చెత్తను సకాలంలో సేకరిస్తూ నగరాన్ని పర్యావరణహితంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీవీ కిషోర్ రెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, నీటి పారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయకుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రెడ్డి పలువురు ప్యానెళ్ల అడ్వకేట్లు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు ఒక్క అవకాశం

కర్నూలు అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): 2015,2016, 2017, 2018 సంవత్సరాలకు సంబంధించి కోర్సు పూర్తి చేసుకోలేని వారికి ఒక అవకాశాన్ని కల్పిస్తున్నట్లు రాయలసీమ యూనివర్సిటీ పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి 4 వరకు ప్రాక్టికల్స్, 6 నుంచి 16 వరకు థీయరీ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకోలేని వారు ఈనెల 31 లోపు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల వద్ద దరఖాస్తుకు తగిన రుసుం చెల్లించాలని తెలిపారు.

అతీగతి లేని రాజోలి, జోలదరాశి

(5వ పేజీ తరువాయి)

పూర్తిగా నిలిచి పోయిన రిజర్వాయర్ పనులు

భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపులు పూర్తి కాకపోవడంతో జొలదరాసి రిజర్వాయరు పనులు ముందుకు సాగలేదు. పట్టాలు ఉన్న బంజరు భూములకు రైతులు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు. ఆరేళ్ల కింద వైసీపీ ప్రభుత్వం భూమి పూజ చేసిందేగాని నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

మంత్రి బీసీపైనే రైతుల ఆశలు: బనగానపల్లె మండలం జొలదరాసి రిజర్వాయర్, చాగలమర్రి మండలంలోని రాజోలి రిజర్వాయర్ నిర్మాణాలకు రోడ్లు భవనాల శాఖ మంత్రిపైనే రైతులు ఆశ పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమకు నష్టపరిహారం అందించి రిజర్వాయర్‌ను పూర్తి చేయాలని రైతులు మంత్రి బీసీని కోరుతున్నారు.


వైసీపీ ప్రభుతంలో తీవ్రంగా మోసపోయాం



వైసీపీ ప్రభుత్వంలో పొలాలు ప్రభుత్వానికి అప్పగించి మోసపోయాం. జగన్ మమ్మల్ని నిలువునా ముంచారు. నష్టపరిహారం అందలేదు. ఎవరికైనా పొలం అమ్మాలన్నా వీలు లేకుండా పోయింది. ఎన్‌డీఏ ప్రభుత్వం అయినా నష్టపరిహారం అందించి ఆదుకోవాలి .

- రైతు గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ నాయకుడు

ఆరేళ్ల నుంచి అవస్థ పడుతున్నాం



జొలదొరాసి రిజర్వాయర్ కింద నాకు ఉన్న 3.10 ఎకరాలు పోయాయి. 6 ఏళ్లుగా నష్టపరిహారం అందలేదు. ఇబ్బందిపడుతున్నా. ఎవరికైనా అమ్మాలన్నా రిజిస్ట్రేషన్ కావడం లేదు. తహసీల్దారు కార్యాలయంలో ఎర్ర చుక్కలు వేశారు.

-గుద్దేటి చంద్రశేఖర్‌రెడ్డి, జోలదరాశి రైతు

బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదు



నా పొలం రిజర్వాయర్ కింద పోయింది. 6 ఏళ్లుగా నష్టపరిహారం అందలేదు. పిల్లల చదువులకు బ్యాంకులో రుణాలు తీసుకోవాలన్నా ఇబ్బందిగా ఉంది. పొలాలు అమ్ముకోడానికి కూడా లేకుండాపోయింది. రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ కావడం లేదు.

-సింగారెడ్డి సూర్యనారాయణరెడ్డి జోలదరాశి

పోటీతత్వంతో క్రీడల్లో గెలవాలి

- ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం స్టూడెంట్ అఫైర్స్ డీన్ కరుణ సాగర్
- వ్యవసాయ విద్యార్థుల క్రీడా పోటీలు ప్రారంభం



బెలూన్లు ఎగర వేస్తున్న ప్రముఖులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న స్టూడెంట్ అఫైర్స్ డీన్ కరుణ సాగర్

మహానంది, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని, పోటీతత్వంతో పాల్గొని గెలవాలని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ఆఫీసర్ కరుణ సాగర్ తెలిపారు. బుధవారం మహానంది వ్యవసాయ కళాశాల క్రీడామైదానంలో రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థుల క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ప్రారంభ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ కరుణ సాగర్‌తో పాటు ఇతర ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం క్రీడాకారులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ కార్యక్రమాన్ని స్వీకరించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక సామర్థ్యాన్ని పెంచడమే కాక మానసిక దృఢత్వాన్ని, సామర్థ్యాన్ని కూడా పెంచుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జి రంగా పాలిటెక్నిక్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, నంద్యాల ఏడీఆర్ జాన్సన్, ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి, యూనివర్శిటీ ఫిజికల్ డైరెక్టర్ రవికాంత్‌రెడ్డి స్టూడెంట్ యక్టివిటీస్ ఇన్‌చార్జి ఆఫీసర్ ఎల్, విజయభాస్కర్‌తో శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు

నంద్యాల క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాలో పారా లీగల్ వలంటీర్ల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నంద్యాల మండల్ లీగల్ సెల్ చైర్మన్ వాసుబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు జిల్లాకు చెందినవారై ఉండాలని పేర్కొన్నారు. సామాజిక సేవ, చట్ట అవగాహన, ప్రజా సంక్షేమానికి అంకితభావం ఉన్న వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి పాసై ఉండాలని, పై స్థాయి విద్యార్హతలు, అనుభవం, చట్ట, సామాజిక సేవల రంగంలో పరిజ్ఞానం ఉన్న వారికి ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, న్యాయ విద్యార్థులు, రాజకీయేతర సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, సామాజిక కార్యకర్తలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు ఫారమ్‌ను నంద్యాల మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయాల నుంచి పొందవచ్చని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తు ఫారంతోపాటు అవసరమైన పత్రాల ప్రతులను నంద్యాల మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయానికి స్వయంగా లేదా పోస్టు ద్వారా పంపాలని తెలిపారు. దరఖాస్తులను ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5గంటలలోగా పంపించాలని పేర్కొన్నారు.

అన్నదానానికి కూరగాయలు సరఫరా చేస్తాం



మహానందిలో కూరగాయల దాత జంగారెడ్డికి మెమెంటో అందచేస్తున్న వేదపండితులు

మహానంది, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో భక్తుల కోసం దేవస్థానం అమలు పరిచే నిత్యాన్నదాన పథకానికి శాశ్వతంగా కూరగాయలను ఉచితంగా అందచేస్తానని హైదరాబాద్‌కు చెందిన కూరగాయల వ్యాపారి మేకల జంగారెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం ఆయన మిగతా వ్యాపారులతో కలసి మహానందికి వచ్చారు. ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం కల్యాణ మంటపంలో వీరిని వేదపండితులు రవిశంకర్ అవధాని, హనుమంత్‌శర్మ శాల్వతో సన్మానించారు.

జగన్ పాలనలో ఆర్థిక వ్యవస్థ సర్వనాశనం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సర్వనాశనమైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మండిపడ్డారు. కర్నూలు నగరంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.10 లక్షల కోట్ల అప్పు, ఏడాదికి రూ. 71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లింపుల భారం రూ. 1.40 లక్షల కోట్ల చెల్లింపు భారం ఆర్థిక వ్యవస్థపై దివాళకు తీసుకొచ్చారని మండి పడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చాక సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి గుది బండగా మారి ఆర్థికంగా కోలుకోలేని పరిస్థితి తెచ్చిందని గణాంకాలతో ప్రజలకు వివరిస్తే, జగన్ పత్రికలో తప్పుడు కథనాలతో చంద్రబాబు అన్న మాటలను వక్రీకరించడం ఎంత వరకు సమంజమని ప్రశ్నించారు. డిగ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, చిక్కీలు, కోడిగుడ్ల బకాయిలు, ధాన్యం బకాయిలు, ఉద్యోగులకు బకాయిలు, ఇరిగేషన్ కాంట్రాక్టర్లకు బకాయిలు, గృహ నిర్మాణ బకాయిలు, ఉపాధి హామీ బకాయిలు ఇలా జగన్ ప్రభుత్వంలో దాదారు రూ.1.40 లక్షల కోట్ల అప్పులు పెండింగ్‌లో పెట్టారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో తెచ్చిన అప్పులు ప్రభుత్వ ఆదాయం పెంచే సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణం లాంటి వాటిపై కాకుండా విలాసాలు, జాల్సాలకు ఖర్చు చేసి తినేశారని మండిపడ్డారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసమే ప్రాధాన్యత ఇస్తూ ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అరు. దావోస్ పర్యటనలో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకురావడంతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషి అభినందనీయమని అన్ని వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు.

ఆత్మార్పణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- అధికారికంగా నిర్వహించడంపై 'కుడా' చైర్మన్ సోమిశెట్టి హర్షం



కర్నూలు అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఈనెల 31 వాసవీ కన్యకా పరమేశ్వరీ మాతా అత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 'కుడా' చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు కోరారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెనుగొండలో అమ్మవారికి పట్టు వస్త్రాలను సీఎం చంద్రబాబు, మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. పరిశ్రమల శాఖ మంత్రిగా టీజీ భరత్ ఆర్యవైశ్యుల తరఫున సీఎం చంద్రబాబు వద్ద విషయాన్ని వివరించి ప్రభుత్వం తరపున అధికారికంగా చేయించడంతో చేసిన కృషి అభినందనీయమని అన్నారు. గతంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆర్యవైశ్యులపై చిన్న చూపు ఉండేదని అన్నారు. ఏ మాత్రం విలువ ఇవ్వకుండా దుర్మార్గం వ్యవహరించారని అన్నారు. పైగా దాడులు కూడా చేశారని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు ఆర్యవైశ్యులకు తగిన ప్రాధాన్యం కల్పిస్తున్నారని అన్నారు.

ప్రజలను మోసగించిన చంద్రబాబు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేశారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని ఎస్వీ కాంప్లెక్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు సూర్ సిక్స్ అని ప్రజలను భ్రమల్లోకి తీసుకెళ్లి ఎన్నికలు ముగిసిన వెంటనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని పథకాలు అమలు చేయలేమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షే మ కార్యక్రమాలను అమలు చేస్తూ సుమారు రూ.15 వేల కోట్ల మూలధన వ్యయం చేసారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఒక్క సంక్షేమ కార్యక్రమాన్ని చేయకుండా కేవలం రూ.13 వేల కోట్లు మూలధన వ్యయం చేశారని తప్పుబట్టారు. సమావేశంలో కార్పొరేటర్లు ఎస్‌టీ షేక్ అహ్మద్, యూనుస్‌బాషా, నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పెద్దకడుబూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పెద్దకడుబూరులోని ఎల్లెల్సీ కాలువ పక్కన చెట్టుకు వ్యక్తి ఉరివేసుకొని తంబళ రంగస్వామి(34) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం జరిగింది. పెద్దకడుబూరుకు చెందిన తంబళ రంగస్వామి భార్య ఏడాది క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపంతో ఉన్న రంగస్వామికి అనారోగ్య సమస్యలు కూడా ఉండడంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం వేకువ జామున ఇంటి నుంచి వెళ్లి ఎల్లెల్సీ కాలువ సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. తల్లి ఈరమ్మ ఫిర్యాదు మేరకు పెద్దకడుబూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం ఓ కేసు విషయంలో ఎమ్మిగనూరు పట్టణ పోలీసులు రంగస్వామి కోసం పెద్దకడుబూరుకు వెళ్లి ఆరా తీశారు. ఎమ్మిగనూరు స్టేషన్‌కు రావాలని పలుమార్లు ఫోన్ చేసినట్లు తీశారు. దీంతో తనను అరెస్టు చేస్తారేమోనని భయంతో బుధవారం గ్రామ సమీపంలోని ఎల్లెల్సీ సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకున్నాడని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

దొంగల అరెస్టు



విద్యుత్ మోటార్లు, తీగలను చూపుతున్న సీఐ, ఎస్ఐ

నందికొట్కూరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ పరిధిలో విద్యుత్ మోటర్లను చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలు బుధవారం పట్టుబడ్డారు. బ్రాహ్మణకొట్కూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న దామగట్ల క్రాస్ రోడ్ వద్ద అనుమానాస్పదంగా వ్యక్తులు సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆకస్మికంగా దాడులు చేసి దొంగలను అరెస్టు చేసినట్లు నందికొట్కూరు గ్రామీణ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై తిరుపాలు తెలిపారు. వారి వద్ద నుండి మూడు టెక్స్‌మో విద్యుత్ మోటర్లను, 100 మీటర్ల విద్యుత్ రాగి వైర్‌ను స్వాధీనం పరుచుకొన్నట్లు వారు తెలిపారు. వారిలో ఒకరు చెంచు సుంకన్నపై కర్నూలు 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో దొంగతనం కేసులున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. రెండో నిందితుడు చెంచు వెంకటరాముడు కల్లూరు మండలం శ్రీనివాస నగర్‌కు చెందిన వాడన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపించి రిమాండ్‌కు పంపనున్నట్లు వారు తెలిపారు.

కారు బోల్తా.. ఆరుగురికి గాయాలు



కాలువలోకి దూసుకెళ్లిన కారు

నంద్యాల క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలం పోలూరు గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకువద్ద బుధవారం కారు బోల్తా పడి ఆరుగురు యువకులకు గాయాలయ్యాయి. నంద్యాల ట్రాఫిక్ పోలీసుల వివరాల మేరకు.. తాడిపత్రికి చెందిన ఖాజా హుసేన్, రమేష్‌తోపాటు మరో నలుగురు యువకులు కారులో పాణ్యం వచ్చారు. పని ముగించుకొని నందికొట్కూరుకు వెళుతుండగా పోలూరు సమీపంలో కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆరుగురు గాయపడ్డారు. కారు అతివేగంగా నడపడంవల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. గాయపడినవారిని స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటోలో చోరీ..

ఆటోలో మహిళ బ్యాగులో నుంచి నగదు, బంగారాన్ని చోరీ చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. బుధవారం శిరివెళ్లకు చెందిన కవిత అనే మహిళ ఆటోలో నంద్యాలకు బయల్దేరింది. తన బ్యాగులో రూ.15వేల నగదుతోపాటు బంగారు నగలు పెట్టుకొంది. అయ్యలూరు గ్రామం వద్ద గుర్తు తెలియని మహిళలు ఆటోలో ఎక్కారు. వారు నూనెపల్లె ఆటో స్టాండ్ వద్ద దిగి వెళ్లిపోయారు. ఆటో కొంతదూరం వెళ్లిన తర్వాత కవిత దిగే ప్రాంతంలో పరిశీలించుకోగా తన బ్యాగును కత్తిరించి అందులోని నగదు, బంగారం చోరీకి గురైనట్లు నిర్ధారించుకుంది. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీఐఎస్‌లో నమోదు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు టీఐఎస్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని డీఈవో శామ్యూల్ పాల్ బుధవారం తెలిపారు. జిల్లాలో 19 మంది ఉపాధ్యాయులు ఇప్పటికీ టీఐఎస్‌లో నమోదు చేసుకోలేదన్నారు. అలాగే మరో 99 మంది ఉపాధ్యాయులు వివరాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. వీరందరూ ఈ నెల 30వ తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు.

టెక్నికల్ అఫీషియల్‌గా పరశురాముడు

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో జరిగే ఆసియా షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా కర్నూలు జిల్లాకు చెందిన పరశురాముడు ఎంపికయ్యారు. ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు నేపాల్ దేశం కోసి రాష్ట్రంలోని ఇతహరి పట్టణంలో జరగనున్న రెండో ఏషియన్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు షూటిం గ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జీత్‌రాజ్ తోమర్ నుంచి ఉత్తర్వులు అందినట్లు పరశురాముడు బుధవారం తెలిపారు.



ముగిసిన సౌత్ జోన్ ఉడ్‌బాల్ పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఏ అవుట్ డోర్ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న సౌత్‌జోన్ ఉడ్ బాల్ పోటీలు బుధవారంతో ముగిసాయి. ఈ పోటీలలో ఆల్ రౌండర్‌లో విజేతగా ఆంధ్రప్రదేశ్ జట్టు విన్నర్‌గా, తమిళనాడు జట్టు రన్నర్‌గా నిలిచాయి. గెలిచిన జట్లకు బహుమతులు ఇస్తారు. ప్రదానోత్సవానికి హార్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ డా. వినోద్ హార్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ ప్రేక్షక గిరి ప్రశాంత్ కుమార్ శ్రీపచవతి ఎస్టేట్ ప్రొప్రైటర్, క్రిడాయ్ సెక్రటరీ బ్రిజేష్ సింగ్, హాజరయ్యారు.

తండ్రీకొడుకుల దుర్మరణం

- భార్యకు తీవ్ర గాయాలు
- ఎమ్మిగనూరు మండలం చెన్నాపురం వద్ద బైకును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

అక్కకు ఆరోగ్యం బాగోలేదని.. ఆమెను చూడడానికి కోటేకల్లుకు బయలుదేరిన తమ్ముడు తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఆయన వెంట ఉన్న నాలుగేళ్ల కుమారుడు కూడా మృతి చెందగా భార్య తీవ్రంగా గాయపడింది. ఎమ్మిగనూరు మండలంలోని చెన్నాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎమ్మిగనూరులో సంత చేసుకొని అక్కడి నుంచి కోటేకల్లుకు బయలుదేరిన వీరి బైకును బస్సు ఢీకొట్టింది. ఘటనా స్థలం, ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు అక్కడున్న వారిని కంటతడి పెట్టించాయి.



సామేల్ (ఫైల్)



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు



చికిత్స పొందుతున్న శాంతమ్మ

ఎమ్మిగనూరు రూరల్/టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నాపురం గ్రామం దగ్గర బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు దుర్మరణం చెందగా.. భార్య తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివి.. ఎమ్మిగనూరు మండలంలోని కోటేకల్ గ్రామానికి చెందిన సామేల్ (27)కు ఎనిమిదేళ్ల క్రితం ఆదోని మండలంలోని పాండవగల్లు గ్రామానికి చెందిన శాంతమ్మతో వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు గౌతమ్(4) ఉన్నారు. వీరు రెండేళ్ల నుంచి ఆదోని మండలంలోని పెద్దపెండేకల్లు గ్రామంలో నివాసం ఉంటూ కూలీ పనులకు వెళ్తూ జీవనం కొనసాగిస్తున్నారు. సామేల్ చిన్న కూతురు సింధు స్కూలుకు వెళ్లింది. పెద్ద కూతురు స్వాతి కోటేకల్లులోనే సామేల్ తల్లిదండ్రుల వద్ద ఉంటూ చదువుకుంటోంది. సామేల్ సోదరి కూడా కోటేకల్లులోనే నివాసం ఉంటోంది. అయితే ఆమెకు ఆరోగ్యం బాగా లేకపోడంతో ఆమెను చూడడంతో పాటు తల్లిదండ్రులను, కూతురిని చూడాలని సామేల్‌తో పాటు భార్య శాంతమ్మ, కుమారుడు గౌతమ్‌తో కలిసి కోటేకల్లుకు బయలుదేరారు. ఎమ్మిగనూరులో పండ్లు కూడా తీసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి కోటేకల్లుకు వెళ్తుండగా చెన్నాపురం దగ్గర వీరు వెళ్తున్న బైకును ఆదోని నుంచి ఎమ్మిగనూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. సామేల్, గౌతమ్ అక్కడిక్కడే చనిపోయారు. భార్య శాంతికి ఓ చేయి విరగడంతో పాటు తలకు రక్తగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని సామేలు, గౌతమ్ మృతదేహాల దగ్గర బోరున విలపించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన బాలుడు గౌతమ్

నేటి నుంచి హరిహర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు

- ప్రారంభించనున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్



మంత్రి టీజీ భరత్‌ను ఆహ్వానిస్తున్న నగర బ్రాహ్మణ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్‌బాగ్ తుంగభద్ర నదీతీరాన ఉన్న హరిహర క్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి వారి 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఆరంభం అవుతు న్నాయి. ఉదయం 8.30 గంటలకు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ ముఖ్య అతిథిగా వచ్చి ధ్వజా రోహణ చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తారని నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ తెలిపారు. అనంతరం టీజీ వెంకటేశ్ తన కుటుంబ సభ్యులతో స్వామి, అమ్మవార్ల మహా పూజల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరి 8 వరకు కొనసాగే స్వామివారి బ్రహోత్సవాల్లో ప్రత్యేక పూజలు, అలంకార సేవలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం స్వామి అమ్మవార్లకు వాహన సేవలు ఉంటాయని తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 4.30 గంటలకు దీపాలంకరణ సేవ, సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, రాత్రి 8.30 గంటలకు మంగళహారతి, ఊంజల సేవ, పవళింపు సేవలు ఉంటాయని తెలిపారు.

అన్నదానానికి టీజీ వెంకటేశ్ రూ.2 లక్షల విరాళం

బ్రహ్మోత్సవాల్లో అన్నదాన కార్యక్రమానికి రూ.2 లక్షల విరాళం ప్రకటించినట్లు నగర బ్రాహ్మణసంఘం అధ్యక్ష గౌరవాధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, చెరువు వెంకట దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాల నిర్వహణ కమిటీ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి చల్లా నాగరాజ శర్మ, ఉప కార్యదర్శులు నాగులవరం రాజశేఖర్, కోశాధికారి సీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై మాట మార్చిన చంద్రబాబు

- వైసీపీ నంద్యాల అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని



మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయలేమని సీఎం చంద్రబాబు ఒప్పుకున్నారని నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బుధవారం నగరంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అలవికాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇవాళ పథకాలు ఇవ్వలేమని నిస్సిగ్గుగా ప్రకటించారన్నారు. టీడీపీ ప్రభుత్వం ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా వలంటీర్లు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల పోస్టులు కుదించిందని అన్నారు.

నీటి పొదుపు శ్రీరామరక్ష

- ఆదర్శ రైతు చంద్రశేఖర్

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో నీటి పొదుపు రైతులకు శ్రీరామరక్ష అని ఆదర్శరైతు యు చంద్రశేఖర్ అన్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన 76వ గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలానికి చెందిన రైతు యు. చంద్రశేఖర్ బుధవారం కలెక్టరేట్‌లోని ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవిని కలిశారు. ఢిల్లీలో జరిగిన విశేషాలను వివరించారు. రాష్ట్రంలోని కర్నూలుతో పాటు అనంతపురం, కడప, పల్నాడు, పార్వతీపురం, ఏలూరు, తిరుపతి జిల్లాల నుంచి ఏడు మంది ఆదర్శ రైతులు, అదే విధంగా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి రైతులు గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారని తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకల అనంతరం జాతీయ వ్యవసాయ విజ్ఞాన కేంద్రం న్యూఢిల్లీలోని పూసా కేంద్రంలో నీటి పొదుపు ద్వారా పంటల సాగులో జరిగే లాభాల గురించి శాస్త్రవేత్తలు తెలిపారని అన్నారు.



న్యూఢిల్లీ వ్యవసాయ కేంద్రంలో కర్నూలు రైతు చంద్రశేఖర్

రైతులకు ఆన్‌లైన్ గుర్తింపు నెంబర్

- ఫార్మర్ రిజిస్ట్రీ ప్రారంభించిన కేంద్రం
- ఆధార్ తరహా ప్రత్యేక గుర్తింపు సంఖ్య



కొలిమిగుండ్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశంలో రైతుల గుర్తింపు కోసం ప్రత్యేక ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకవచ్చింది. 26న గణతంత్ర దినోత్సవం రోజున మన రాష్ట్రంలో ఈ పోర్టల్ అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వ్యవసాయ శాఖ అధికారులు ప్రారంభిం చనున్నారు. దీని ద్వారా ప్రతి రైతుకూ ఒక ప్రత్యేక గుర్తింపు లభించనుంది. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో 14 అంకెలతో కూడిన ప్రత్యేక సంఖ్యను కేటాయిస్తుంది. ఇది దేశంలో రైతు గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుంది. ఈ గుర్తింపు కార్డుల ద్వారా రైతులను అప్రమత్తం చేస్తారు. వాతావరణ మార్పులపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తారు. వ్యవసాయ పథకాలను నేరుగా చేరవే స్తారు. పంట నష్టం, ప్రకృతి వైపరీత్యాలు, బీమా పరిహారంలో ఈ గుర్తింపు కార్డు ఎంతో ఉపయోగకరం కానుంది. రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ తప్పక చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. స్థానిక రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి, తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. మరోవైపు ఆన్‌లైన్ అవగాహన ఉన్న రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, లేదా వెబ్ పోర్టల్‌లో స్వయంగా కూడా నమోదు చేసుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది.



రైతులు నమోదు చేసుకోవాలి

రైతులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఆధార్ కార్డు, రైతు పొలం 1.బి ఆధార్‌తో లింక్ ఉన్న మొబైల్ నంబరుతో స్థానిక రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలి. ఆన్‌లైన్‌లో నమోదు తర్వాత రైతులకు 14 అంకెలతో కూడిన వ్యక్తిగత గుర్తింపు సంఖ్య ఇస్తారు. **- భూమా జ్యోతి, ఏవో.**



నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

రుణాలతో జీవనోపాధి పొందాలి



ప్రశంసా పత్రాలు పొందిన వారితో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

పాణ్యం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పేద మహిళలు తీసుకున్న రుణాలతో జీవనోపాధి పొందాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. పాణ్యం ఎంఎంఎస్ కార్యాలయంలో బుధవారం 40 మంది మహిళా సంఘం సభ్యులకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ మహిళా సంఘం సభ్యులు పేదరికం నుంచి బయటికి రావడానికి ఆదాయం పెంచుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు సభ్యులు పొందిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న సభ్యులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రవీంద్రబాబు, స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజరు శ్రీకాంత్ రెడ్డి, ఏపీఎం ప్రసాదు, మండల సమాఖ్య కార్యదర్శి మద్యమ్మ, డీపీఎంలు బాబురావు, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే గౌరు



సమావేశంలో వైద్య సిబ్బందితో చర్చిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పాణ్యం ఎమ్మెల్యే, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గౌరు చరిత అన్నారు. బుధవారం మద్దూరు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024 - 25 సంవత్సరానికి హెచ్‌డీఎఫ్ నిధులు రూ.76 వేలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులు ఆసుపత్రి అభివృద్ధికి చాలడం లేదని, పెంచడానికి ఉన్నతాధికారులతో చర్చిస్తానని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంపీపీ ఉసేన్‌బీ, వైద్యాధికారి డాక్టర్ సునీత, సర్పంచ్ ప్రదీప్‌కుమార్ రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మిదేవి, టీడీపీ మం డ కన్వీనర్ గణపం జయరామిరెడ్డి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు దేవదానం, సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

చాపిరేవుల బాధితులకు పరామర్శ

నంద్యాల రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చాపిరేవులలో మంగళవారం తెల్లవారుజామున ఓ ఇంట్లో పేలిన గ్యాస్ సిలిండర్ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఎనిమిది మందికి గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ప్రమాదం జరిగిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఫరూక్ విజయవాడ పర్యటన నుంచి వచ్చాక బాధితులను పరామర్శిస్తారని తెలిపారు.

మంత్రికి ఘన సన్మానం

నంద్యాల, జనవరి 29, (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడా పోటీలకు ముఖ్యఅతిథులుగా హాజరైన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ స్థానిక తమ టీడీపీ కార్యాలయంలో ఘనంగా బుధవారం సన్మానించారు. ముందుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు, జిల్లెల శ్రీరాములు, పలువురు టీడీపీ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలను మంత్రికి పరిచయం చేశారు. అనంతరం మంత్రి వారికి కరచాలనం చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కొత్తపలి, జనవరి 29, (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో మినుము, కంది పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆత్మకూరు వ్యవసాయ సంచాలకులు ఆంజనేయ అన్నారు. బుధవారం మండలంలోని ముసలిమడుగు, ఎర్రమటం, గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి మహేష్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ రబీ సీజన్‌లో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు కచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అనంతరం ఎర్రమఠంలో రైతులు సాగు చేసిన పొగాకు పంటలో వ్యవసాయాధికారి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రవీంద్రనాయక్, గౌరమ్మ పాల్గొన్నారు.

రేపటి లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోండి

గడివేముల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కంది పంటను విక్రయించవలసిన రైతులు 31వ తేదీ లోపు రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి హేమసుందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెసరవాయి గ్రామంలో బుధవారం ఆయన రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.7,550 మద్దతు ధరతో కంది పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. అనంతరం సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు.

వంతెన ఎత్తు పెంచాలి

పాములపాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అండర్ పాస్ వంతెన నిర్మాణం ఎత్తు పెంచాలని చెలిమిళ్ల, లింగాల సర్పంచ్‌లు, చంద్రారెడ్డి, మల్లీశ్వరగౌడ్ అన్నారు. బుధవారం పాములపాడు శివార్లలోని చెలిమిళ్ల రస్తాలో నిర్మిస్తుండగా అక్కడికి వెళ్లి నిరసన తెలిపారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ స్థానిక ఎస్‌ఐ సురేశ్‌కుమార్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ నిత్యం పాములపాడు, చెలిమిళ్ల రస్తాలో దాదాపు 20 గ్రామాలకు సంబంధించిన వాహనాలు తిరుగుతుంటాయని అన్నారు. తక్కువ ఎత్తు, తక్కువ వెడల్పుతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని తెలిపారు. డీఎస్పీ మాట్లాడుతూ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.

జగన్ జల్సాలతో రాష్ట్రం దివాలా

ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



ఎ.కోడూరు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో మాజీ సీఎం జగన్ జల్సాలకు, విలాసాలకు రాష్ట్రం దివాలా తీసిందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం వెలుగోడు మండలంలోని వేల్పనూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.10 లక్షల కోట్లు అప్పులు చేశారని, దీంతో ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, రూ.40వేల కోట్లు వడ్డీ భారంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. అయినప్పటికీ గడిచిన ఏడు నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర వాటికి రూ.22 వేల కోట్ల కోట్లను తమ ప్రభుత్వం చెల్లించినట్లు తెలిపారు. జగన్ చేసిన అప్పులతో రాష్ట్రానికి ఎవరు అప్పులు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లలో రూ.8 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని చెప్పారు. భూ కేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్ పార్క్‌ల తదితర అనుమతులకు లక్షల కోట్లను కాజేశారని విమర్శించారు. టీడీఆర్ బాండ్లు, స్మార్ట్ మీటర్ల కొనుగోలు, రేషన్ బియ్యంలో చేతివాటం, చిన్నారులకు పోషణకు పంపిణీ చేసే చిక్కిలు, కోడిగ్రుడ్లు వంటి వాటిలో కూడా అవినీతికి పాల్పడ్డారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని బాగు చేసేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు పాటుపడుతున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రానికి పెట్టుబ డులు తీసుకొచ్చి సంపద సృష్టించి ఆర్థిక కష్టాలను గట్టెక్కించే ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

బండిఆత్మకూరు: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. బుధవారం ఎ.కోడూరులో నలుగురికి రూ.3.76 లక్షల చెక్కులు, జీసీ పాలెం గ్రామంలో ఇరువురితో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న వారందరికీ రూ.45 లక్షల సహాయం చెక్కులు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కంచర్ల చిన్న లింగారెడ్డి, వడ్డు మధుసూదన్‌రెడ్డి, దేరెడ్డి శ్రీనివాసరెడ్డి, కేసీ కెనాల్ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శివకుమార్, షఫీవుల్లా పాల్గొన్నారు.

వెలుగోడు: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. వేల్పనూరులో సీఎం సహాయ నిధి కింద 50 మంది లబ్ధిదారులకు రూ.45 లక్షలు మంజూరయ్యాయి. ఆ చెక్కులను బుధవారం వేల్పనూరులోని ఆయన నివాసంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నారపు శేషిరెడ్డి, క్రిష్టారెడ్డి, జాకీర్ హుస్సేన్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

సాక్షి గణపతికి విశేష పూజలు



జ్వాలా వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు



సాక్షిగణపతి

శ్రీశైలం (ఆత్మకూరు), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్ర పరిధిలోని సాక్షి గణపతి స్వామి ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం తరపున ప్రతి బుధవారం, సంకటహర చవితి, పౌర్ణమి రోజుల్లో స్వామి వారికి సర్కారి సేవ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పంచామృతాలు, ఫలోదకాలతోపాటు హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలాలతో అభిషేకం చేశారు. అలాగే పుష్పార్చన చేసి నివేదిన కార్యక్రమాలు చేపట్టారు.

జ్వాలా వీరభద్ర స్వామికి..

శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్ర స్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి ఉత్తర భాగంలోకి మల్లికా గుండానికి పక్కనే స్వామివారు జ్వాలా మకుటంతో పది చేతులను కలిగి విశిష్టరూపంలో దర్శనమిస్తారు. శిల్పశాస్త్ర పరిభాషలో ఈ స్వామివారిని అఘోర వీరభద్రమూర్తి అని పిలుస్తారు. స్వామివారి ప్రదోశకాల సమయంలో పంచామృతాలు, ఫలోదకాలు, గంధోదకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, హరిద్రోదకంతో పాటు మల్లికాగుండంలోని శుద్ధ జలాలచే అభిషేకించారు. అనంతరం స్వామివారికి పుష్పార్చన గావించి నివేదిన కార్యక్రమాలు చేపట్టారు. కాగా స్వామివారికి అభిషేకించడం వల్ల లోకశాంతి, దుర్భిక్షనివారణ, భక్తుల కోర్కెలు నెరవేరుతాయన్నది విశ్వాసం.

బయలు వీరభద్రస్వామికి..

శ్రీశైల క్షేత్ర పాలకుడైన బయలు వీరభద్ర స్వామివారికి మంగళవారం ప్రదోష కాలంలో అమావాస్య పూజలు చేపట్టారు. ప్రతి మంగళవారం, అమవాస్య రోజుల్లో స్వామివారికి ఈ క్రతువును దేవస్థానం సర్కారి సేవగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పంచామృతాలు, బిల్వోదకం, కుంకు మోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధ జలాలతో అభిషేకించారు. ఆ తర్వాత స్వామి వారికి విశేష అలంకరణ చేసి ప్రదోషకాల పూజలు నిర్వహించారు.

అమవాస్య పూజలు

బండిఆత్మకూరు: మండలంలోని పెద్దదేవళాపురం గ్రామ శివారులో వెలసిన ఏకరాతి శిలా అభయాంజనేయ స్వామిని వేలాది భక్తులు దర్శించుకున్నారు. బుధవారం మౌని అమావాస్యను పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు శివరాజునాయక్, నాగేశ్వరరావు నాయక్‌ల ఆధ్వర్యంలో అర్చకులు ఉదయాన్నే స్వామి వారికి ఆకు పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో తేజేశ్వరనాయక్, శివనాయక్ పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో ..

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు పట్టణంలో వెలిసిన అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ పురోహితులు అనిల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో బుధవారం మౌని అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 మంది మహిళ పూజలు చేశారు. అనంతరం స్వామివారి భజనా కార్యక్రమంతోపాటు సామూహిక కుంకుమార్చ నలు, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ఏకధూప హారతి, కుంభహారతి, మహా మంగళ హారతులు ఇచ్చారు. శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఒంగోలుకు చెందిన అనే సీతారామయ్య భక్తుడు బుధవారం రూ.1,01,1116 విరాళం అందజేశారు. నిత్యాకళారాధన వేదికపై అనంతపురం ధర్మవరానికి చెందిన శ్రీలలిత నృత్య కళానికేతన్ వారిచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించారు.

నాటుసారా తయారీ బట్టీలపై దాడులు

నందికొట్కూరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మండలం కోళ్లబావాపురం గ్రామంలోని దక్షిణలో ఉన్న అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీ బట్టీలపై ఎక్సైజ్ ఎస్సై జఫ్రుల్లా సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్సై జఫ్రుల్లా మాట్లాడుతూ రాబడిన విశ్వసనీయ సమాచారం మేర కు.. కోళ్లబావాపురం గ్రామం సమీపంలో గల అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీ బట్టీలను నిర్వహిస్తున్నారని తెలిసి దాడి నిర్వహిం చామని అన్నారు. ఈ దాడిలో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన దాదాపుగా 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శంకర్ నాయక్, సిబ్బంది సుధీర్‌కుమార్, శివన్న, మధుప్రసాద్, రమిజాబీ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ హత్య దారుణం

కొత్తపలి, జనవరి 29, (ఆంధ్రజ్యోతి): అరికెర ఫీల్డ్ అసిస్టెంట్ కురువ ఈరన్నను దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ సీఐటీయూ అనుబంధం కొత్తపల్లి మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నక్కా సంపత్, సుదాకర్, స్వాములు, విజయలక్ష్మి, రామలక్ష్మి, రత్నాకర్, కళ్యాణ్, ఎల్ల నాయుడు పాల్గొన్నారు.

పాములేటి స్వామి ద్వితీయ ఆరాధన

నంద్యాల కల్చరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎన్జీవో కాలనీలో గల అమరయోగా వికాస కేంద్రంలో బుధవారం అచల పరిపూర్ణానంద యోగానంద పాములేటి స్వామి ద్వితీయ ఆరాధనను కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పాములేటి స్వామి విగ్రహానికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు.

క్రిష్ణా బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి

వెలుగోడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): క్రిష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని రాయలసీయ తాగునీటి సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యలయంలో తహసీల్దార్ శ్రీనివాసగౌడ్‌ను కలసి పలు డిమాండ్‌లతో కూడిన డిమాండ్ల వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో భాస్కరరెడ్డి, నసురుల్లాఖాన్, రామచంద్రారెడ్డి, రవికుమార్, రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పేదల స్థలాలను కబ్జా చేస్తే ఊరుకోం

నంద్యాల రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పేదల స్థలాలను కబ్జా చేయాలని చూస్తే ఊరుకోబోమని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, మండల కార్యదర్శి బాలవెంకట్ అన్నారు. నంద్యాల పట్టణంలోని బర్మశాలలో 40 సంవత్సరాలుగా జీవనం సాగిస్తూ రోజువారి వేతనంతో జీవనం సాగించే వారి స్థలాలను కబ్జా చేయాలని చేస్తున్నారని తెలిపారు. బర్మాశాలలో నివాసం ఉంటున్న నిజమైన అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని స్థానిక న్యాయశాఖ మంత్రి ఫరూక్, కలెక్టర్ కోరారు. లేదంటే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

పాఠశాలలకు సామగ్రి పంపిణీ

నంద్యాల రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండల పరిధిలోని ఆరు పాఠశాలలకు ఐడీబీఐ సహకారంతో సామగ్రి, ఫర్నీచర్ పంపిణీ చేశారు. బుధవారం చాపిరేవుల, క్రాంతినగర్, బాపూజీ నగర్, పాండురంగాపురం, ఎంపీపీఎస్ పాఠశాలలకు పలు రకాల సామగ్రిని, నందమూరి నగర్‌లోని రెండు కేజీబీవీ సెంటర్లకు కావాల్సిన ఫర్నీచరు, బ్యాంక్ మేనేజర్ మృదుల అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మం, ప్రధానోపాధ్యాయులు పగడాల శ్రీనివాసరావు, శ్రీలత, హైమావతి, మహాలక్ష్మి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

గడివేముల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధుల కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో వాసుదేవగుప్త తెలిపారు. సర్వసభ్య సమావేశ సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు అందించి త్వరలో నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

పెద్దదేవళాపురం చెరువు చైర్మన్ మృతి

బండిఆత్మకూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దదేవళాపురం ఎర్ర చెరువు చైర్మన్ ఆరేలి నాగలక్ష్మమ్మ (67) మృతి చెందారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అన్ని పనులు చేసి ఉన్నట్లుండి కుప్పకూలి శ్వాస వదిలారని తెలిపారు. గత నెల 14వ తేదీన నాగలక్ష్మమ్మను ఎర్ర చెరువు చైర్మన్‌గా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమె మృతిపట్ల పలువురు టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

రేపటి లోపు అప్‌లోడ్ చేయాలి

నంద్యాల కల్చరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉపాధ్యాయులు తమ సమాచారాన్ని ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోప అప్‌లోడ్ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రెడ్డి అన్నారు. ఈ టిస్ యాప్ 31వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుందని తెలిపారు. అప్‌లోడ్ చేయని చేసుకోవాలని కోరారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

ఆత్మకూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణానికి చెందిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కురుమూర్తిపై దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేసి శిక్షించాలని ఆ సంఘం నాయకుడు రఘురాముడు అన్నారు. బుధవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కురుమూర్తిపై వ్యక్తిగత కారణాలతో దాడులు చేయడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో వెంకటస్వామిగౌడ్, రామకృష్ణ, బాల స్వామియాదవ్, వీరన్న, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌సింగ్, రమణ పాల్గొన్నారు.

సాగు నీటి ప్రాజెక్టులను ఏర్పాటు చేయండి

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే, మాండ్ర



మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాండ్ర

నందికొట్కూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నూతన సాగు నీటి ప్రాజెక్టులను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును టీడీపీ నాయకులు మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్యలు కోరారు. బుధవారం విజయవాడలోని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల ముందు నూతనంగా ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి మిడ్తూరు మండలంలోని పొలాలకు సాగు నీటితోపాటు తాగు నీరందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కృష్ణా నది బ్యాక్ వాటర్ నుంచి సంగమేశ్వర ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి కొత్తపల్లి మండలంలోని ఆరేడు చెరువులను నింపడంతో వేల ఎకరాలకు సాగు నీరందుతుందని తెలిపారు. ఎత్తిపోతల ద్వారా నేరుగా దాదాపు ఐదు వేల ఎకరాలకు సాగు నీరు అందించవచ్చన్నారు. వైసీపీ హయాంలో దెబ్బతిన్న అలగనూరు రిజర్వాయర్ మరమ్మత్తు పనులను పూర్తి చేసి నంద్యాల, కడప జిల్లాలలోని భూములకు సాగునీరందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి



డప్పులతో ర్యాలీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బండిఆత్మకూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదిగలంతా ఫిబ్రవరి నెల 7వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకట సుబ్బన్న, దర్గయ్య పిలుపునిచ్చారు. బుధవారం బండిఆత్మకూరులో డప్పులు వాయిస్తూ ర్యాలీ నిర్వహించారు. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యాన ఫిబ్రవరి హైదరాబాద్‌లో 7వ తేదీ జరిగే లక్ష డప్పుల, గొంతుకల పిలుపు ఎస్సీ వర్గీకరణకు వినిపించాలన్నారు. మాదిగలంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాశేమలు, శివకుమార్, దశరథుడు, చిట్టెన్న, వరదరాజులు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

1600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ఆత్మకూరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలూటి గూడెం గ్రామ శివార్లలో నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ కర్నూలు సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో మూకుమ్మడిగా దాడులు నిర్వహించినట్లు ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో సోదాలు నిర్వహించామని చెప్పారు. దాడుల్లో భాగంగా ఆ గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో ఓ నాటు సారా స్థావరాన్ని గుర్తించి బట్టి వద్ద ఉన్న 1600 లీటర్ల బెల్లపు ఊట, నాటుసారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు వీరస్వామి, జగదీష్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో రోడ్ల పరిశీలన

బండిఆత్మకూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగనన్న కాలనీల్లో నిర్మించిన రోడ్లను అధికారులు తనిఖీ చేశారు. బుధవారం మండలంలోని పెద్దదేవళాపురం. భోజనం, పరమటూరు, సంతజూటూరు, నారాయణపురం, చిన్నదేవళాపురం, కాకనూరు, బండిఆత్మకూరు, ఎర్రగుంట్ల గ్రామాల్లో పీఆర్ క్వాలిటీ డీఈ అయాజ్, ఏఈలు రాముడు, వెంకటరాముడు తనిఖీ చేశారు. ఏఈ వాసుదేవుడు, ఏపీఎం వసుధ, ఈసీ వరదరాజులు, టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

శాంతిరాం విద్యార్థుల పారిశ్రామిక పర్యటన

పాణ్యం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక పర్యటనలో భాగంగా శాంతిరాం ఇంజనీరింగ్ విద్యార్థులు కర్నూలు ఆకాశవాణి రేడియో స్టేషన్‌ను సందర్శించారు. బుధవారం ఈసీఈ, ఐఈ (ఐ)విభాగం ఆధ్వర్యంలో స్టేషన్‌ను సందర్శించి రేడియో పనితీరు, ప్రసారాల వ్యవస్థల తీరు, తదితర వాటిని తెలుసుకున్నారు. పరిశ్రమలలో ప్రత్యక్ష అనుభవాన్ని విద్యార్థులకు అందించడం ద్వారా నైపుణ్యాలను నేరుగా మెరుగుపర్చడంలో పర్యటన దోహదపడుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్లు మహ్మద్ ఇలియాస్, శ్రీనివాసరావు, మేరీశ్వేత, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన

నంద్యాల క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, నంద్యాల ఎస్‌డీపీవో ఎం.జావలి అల్ఫాన్సో సూచనలతో రహదారి భద్రతా మాసోత్సవం సందర్భంగా బుధవారం నంద్యాల పట్టణ శివారులోని చాపిరేవుల టోల్‌ప్లాజా వద్ద ఆర్ఈపీఎల్ సహకారంతో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీటీవో ఐశ్వర్యరెడ్డి, ఎంవీఐ శ్రీకాంత్, ఏఆర్ అదనపు ఎస్పీ చంద్రబాబు, ట్రాఫిక్ సీఐ బి.మల్లికార్జున గుప్త పాల్గొని రహదారి భద్రతాచర్యలు, బాధ్యతాయుతమైన ప్రవర్తనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చాపిరేవుల టోల్‌ప్లాజా నుంచి పద్మావతినగర్ ఆర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఈపీఎల్ ప్రతినిధి మదన్‌మోహన్, రామకృష్ణ డిగ్రీ కాలేజి, నేసనల్ జూనియర్, డిగ్రీ కాలేజీ, న్యూక్లియస్ జూనియర్ కాలేజి, వెంకటేశ్వర జూనియర్ కాలేజి, సీఎంఆర్ జూనియర్ కాలేజీలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో జీవనోపాధి

వెలుగోడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జలాశయాలలో చేపల పెంపకంతో ఎంతో మంది మత్స్యకారుల కుటుంబాలకు జీవనోపాధి కలుగుతుందని ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ రాఘవరెడ్డి అన్నారు. బుధవారం వెలుగోడు తెలుగుగంగ జలాశయంలో స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఐదు లక్షల చేప పిల్లలను జలాశయంలో వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా వీటిని విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నవీన్, టీడీపీ మండల అధ్యక్షుడు అన్నారపు శేషిరెడ్డి, మాజీ సర్పంచ్ అబ్దుల్‌కాలం, మద్దెల శంకరరెడ్డి, రఘుస్వామిరెడ్డి, పాల శంకరరెడ్డి, ఎఫ్‌డీవోలు సామన్న, నాయక్, ఆర్ఐ వెంకటరామిరెడ్డి, వీఆర్వో చక్రి పాల్గొన్నారు.



వెలుగోడు జలాశయంలో చేప పిల్లలు వదులుతున్న దృశ్యం

నిరుపయోగంగా కూరగాయల మార్కెట్

● రోడ్లపై వారాంతపు సంత
● ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రజలు

బేతంచెర్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కూరగాయల మార్కెట్ నిరుపయోగంగా మారింది. ఎండకు, వానకు వ్యాపారులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రూ.45లక్షలు వెచ్చించి కోటపేటలో సొంత మార్కెట్‌ను గత ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. అయితే వ్యాపారులు మాత్రం రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో ప్రజలకు, వాహనదారులకు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం వచ్చిందంటే చాలు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి కూరగాయల వ్యాపారులు సంత మార్కెట్‌లో నిర్వహించాల్సి ఉండగా.. రోడ్లపై వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. సంత మార్కెట్ ఏర్పాటు చేస్తే వ్యాపారులు వాటిని ఉపయోగించు కోవడం లేదని రోడ్లకు ఇరువైపులా తోపుడు బండ్లు, టాటా ఏసీలు, ఆటోలలో వ్యాపారాలు చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగర పంచాయతీ అధికారులైనా స్పందించి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


కోటపేటలో నిరుపయోగంగా ఉన్న కూరగాయల మార్కెట్

● రోడ్లపై ఆవుల మంద..

పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంట ఆవులు మందలుగా తిరుగుతుండటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తబస్టాండు సమీపంలో కర్నూలు-బనగానపల్లె ప్రధాన రోడ్డులో ఆవులు మందలుగా వెళ్తుండటంతో వాటిని తప్పించబోయి ఓ ద్విచక్ర వాహనదారుడు కింద పడి తీవ్రగాయాలయ్యాయి. ఎన్నిసార్లు నగర పంచాయతీ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా ఆవుల యజమానులకు నోటీసులు ఇచ్చి రోడ్లు వదలకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


అమ్మవారిశాల సర్కిల్‌లో రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారుల విక్రయాలు


విచ్చల విడిగా రోడ్డుపై నిలిచిన ఆవులు

పకడ్బందీగా కుష్ఠు వ్యాధి సర్వే నిర్వహించండి


టంగుటూరులో ఇంటింటి సర్వేను తనిఖీ చేస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ శరదాబాయి

బనగానపల్లె, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి నిర్ధారణ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శారదాబాయి సూచించారు. బుధవారం మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఎల్‌సీడీసీ సర్వేను, రిజిస్టరును తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ తేజశ్విని, డాక్టర్ శివశంకరుడు, పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌పై అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

కొలిమిగుండ్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మొబైల్ అత్యంత అవసరంగా మారిన ప్రస్తుత సమాజంలో, సైబర్ నేరాలపై అత్యంత అప్రమత్తత అవసరమని ఆళ్లగడ్డ డీఎస్పీ కె.ప్రమోద్ అన్నారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ బుధవారం మొదటి సారిగా కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో ఉన్న ఇండోర్ స్టేడియం, చిల్డ్రన్ పార్కు, ఇతర ప్రాంతాలను పరిశీలించి, పార్కును పరిశుభ్రంగా ఉంచాలని సీఐ రమేష్‌బాబుకు సూచించారు. అనంతరం పాత నేరస్థుల కు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ రమేష్‌బాబు, ఏఎస్‌ఐ గోవిందనాయక్, పీసీలు రాజ్‌బాస్కర్, యశోద పాల్గొన్నారు.


ఇండోర్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రమోద్

120 గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు

చాగలమర్రి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలోని 12 మండలాల్లో 120 పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య తెలిపారు. బుధవారం చాగలమర్రిలో ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 105 గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. బహుళ వార్షిక పశుగ్రాసం కింద 432 ఎకరాలు లక్ష్యం కాగా 145 ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. చాగలమర్రి మండలంలో 36 ఎకరాలకు గాను 24 ఎకరాలకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పశుగణన 98 శాతం పూర్తయిందని అన్నారు. కార్యక్రమంలో ఏడీ వరప్రసాద్, పశు వైద్యాధికారులు సాయిబాబా, దీపకుమారి, వీఏ కోటయ్య పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాలను కూల్చివేస్తాం

కోవెలకుంట్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న, ఎస్ఆర్‌బీసీ, ఇందిరమ్మ కాలనీల్లో అనుమతులు లేకుండా లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపడితే కూల్చివేస్తామని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం ఎస్ఆర్‌బీసీ కాలనీలో తహసీల్దార్ పర్యటించారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపట్టిన ఏడు నిర్మాణాలను గుర్తించి ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. అలాగే ఇందిరమ్మ కాలనీలో మరికొన్ని ఇళ్లను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో సర్వేయర్లు, వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.


నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

నల్లవాగు పల్లెలో పార్వేట పల్లకీ ఉత్సవం

రుద్రవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పార్వేట పల్లకీ ఉత్సవం మొదటి విడత బుధవారం సాయంత్రం నల్లవాగు పల్లెలో ముగిసింది. గ్రామంలో జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాద వరద స్వాములకు నమో నారసింహ అంటూ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో బంధువులలో సందడి నెలకొంది. తిరిగి ఆళ్లగడ్డ మండలానికి పార్వేట ఉత్సవ పల్లకీ చేరుకుంది.

రథసప్తమికి ఆలయం ముస్తాబు

అవుకు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివవరం గ్రామంలో వెలసిన సూర్యనారాయణ స్వామి ఆలయం రథసప్తమి వేడుకలకు ముస్తాబవుతుంది. వచ్చేనెల 4న రథసప్తమి రోజున సూర్యుడు కిరణాలు ఆలయంలోని సూర్యనారాయణస్వామి మూలవిరాట్ మీద పడటం దేవాలయం విశిష్టత. రథసప్తమి రోజున స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బేతంచెర్ల ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఏకగ్రీవం

బేతంచెర్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని షాదీఖానాలో బేతంచెర్ల ముస్లిం వెల్ఫేర్ కమిటీని బుధవారం మండల ఖాజీ నూర్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ జాకీరుల్లా బేగ్, ముర్తుజావలి, సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.ఖాజా హుశేన్, ఉపాధ్యక్షుడిగా ఎస్.వలిబాషా, సెక్రటరీగా కరీముల్లా, జాయింట్ సెక్రటరీగా జుబేర్ ఖాన్, ట్రెజరర్ అబ్దుల్ సలాం, మీడియా కోఆర్డినేటర్‌గా హిమాయత్, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ సభ్యులు సలాం, వలి, సద్దాం, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో నీటి సమస్య పరిష్కారం

డోన్ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి చొరవతో ధర్మవరం గ్రామంలో తాగునీటి సమస్య తీరింది. గ్రామ టీడీపీ నాయకులు బోయ సంజీవుడు, బోయ రామనాయుడుతో పాటు గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

త్వరలో చెరువులకు నీరు

- డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

ప్యాపిలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హంద్రీ, నీవా సుజల స్రవంతి పథకం ద్వారా త్వరలో చెరువులకు నీరు నింపుతామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఏనుగమర్రి, వెంగళాంపల్లి, ప్యాపిలి, కలచట్ల, గుడిపాడు, ఊటకొండ గ్రామాల్లోని చెరువులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో 38 చెరువులకు నీరందించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్యాపిలి, డోన్ మండలాల్లో 28 చెరువులకు నీరు నింపామని త్వరలో మిగిలిన చెరువులకు నీరు సరఫరా చేస్తామని తెలిపారు. తద్వారా నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావు, నాయకులు రాజా నారాయణమూర్తి, టి శ్రీనివాసులు, ఏనుగమర్రి రామక్రిష్ణ, అలేబాదు పరమేష్, తూర్పు లింగారెడ్డి, ఆర్ఈ నాగరాజు, మోపూరి రాము,కేసీ మద్దిలేటి, రామ్మోహన్‌యాదవ్, ఖాజాపీర్, శ్రీకాంత్, రమేష్‌రెడ్డి, జయశీలమ్మ, కలచట్ల ప్రసాద్, చల్లా వీరాంజినేయులు, మధుకుమార్, రాజారవి, సూర్యనారాయణగౌడు, శంకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చెరువులను ఎమ్మెల్యే కోట్ల పరిశీలన

డోన్ రూరల్: మండలంలోని అబ్బిరెడ్డిపల్లె చెరువు, దేవరబండ గ్రామ చెరువులను డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి బుధవారం పరిశీలించారు. చెరువుల నీటి సామర్థ్యం గురించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు ఎమ్మెల్యే కోట్ల వెంట టీడీపీ సీనియర్ నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వలసల రామకృష్ణ, మండల అధ్యక్షులు వెంకటనాయునిపల్లె శ్రీను, నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, సీలం భాస్కర్ నాయుడు, డీఎస్పీ పి.శ్రీనివాసులు, పట్టణ, రూరల్ సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్ బాబు, ఎస్ఐలు శరత్ కుమార్ రెడ్డి, మమత తదితరులున్నారు.


ఏనుగమర్రి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల తదితరులు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదు: ఎమ్మెల్యే కోట్ల

డోన్ రూరల్: రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగోలేనప్పటికీ ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దివాలా తీయించారని ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థను భ్రష్టు పట్టించిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. డోన్ నియోజకవర్గానికి ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. రైతులకు చెరువుల ద్వారా సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. డోన్ నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

చాంద్‌బాషా మృతి పార్టీకి తీరని లోటు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 29(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ జడ్పీటీసీ సుద్దపల్లె చాంద్‌బాషా మృతి పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఇటీవల జరిగిన రహదారి ప్రమాదంలో చాంద్‌బాషా మృతిచెందడంతో ఆయన కుటుంబసభ్యులను ఎమ్మెల్యే బుధవారం పరామర్శించారు. కుటుంబీకులను ఆమె ఓదార్చి ధైర్యం చెప్పారు. టీడీపీ ప్రభుత్వం, భూమా కుటుంబం ఎళ్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చాంద్‌బాషా పిల్లల చదువుకు తమ వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు.

కార్యకర్త మృతికి నివాళి :

ఆళ్లగడ్డ మండలం అహోబిలం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మర్రిపల్లె నారాయణ అనారోగ్యంతో మృతిచెందడంతో యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి ఆయన మృతదేహానికి పూలామల వేసి బుధవారం నివాళి అర్పించారు. టీడీపీ మండల కన్వీనర్ శీలం హరికుమార్‌రెడ్డి, పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

జగన్ ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల) : జగన్ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అఖిలప్రియ బుధవారం మాట్లాడుతూ వైసీపీ హయాంలో చేసిన రూ.10 లక్షల కోట్ల అప్పుకు ప్రతి ఏడాది రూ.71 వేల కోట్ల అసలు, 1.40 లక్షల కోట్ల వడ్డీ చెల్లింపు భారం ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి గుదిబండగా మారిందన్నారు. జగన్ ప్రభుత్వం తెచ్చిన అప్పులు రాష్ట్రాభివృద్ధికి కాకుండా విలాసాలకు వినియోగించారని ఆమె మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు.


బాధితులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఇష్టపడి చదవాలి: డీఈవో

రుద్రవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఇష్టపడి చదివి భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాలని డీఈవో జనార్దన్‌రెడ్డి సూచించారు. బుధవారం ఉదయాన రుద్రవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి స్టడీ అవర్స్ క్లాసులను పరిశీలించారు. విద్యార్థులను ఏ చాప్టరుకు ఎలా చదువుతున్నారని ప్రశ్నించారు. ఉపాధ్యాయులను ఏ చాప్టరు విద్యార్థులకు ఎలా బోధించారని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుడే విద్యార్థికి దిక్సూచిలా ఉండి విద్యాబోధన చేయాలన్నారు. పదోతరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. అనంతరం పాఠశాల భవనాలను పరిశీలించారు. డీఈవోను పూలమాల శాలువాతో ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ వీరరాఘవయ్య హెచ్ఎం సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్ రెడ్డి

మెడికల్ షాపుల తనిఖీ

బేతంచెర్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అన్ని మెడికల్ షాపులను జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ పర్వీన్ బుధవారం సాయంత్రం తనిఖీలు చేశారు. మెడికల్ షాపుల్లో నకిలీ మందులు ఏ మైనా ఉన్నాయా అని పరిశీలించారు. అనంతరం అమ్మవారిశాలలో మెడికల్ షాపుల యజమానులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెడికల్ షాపులో యజమానులు, వైద్యులు సూచించిన ప్రిస్క్రిప్షన్ మేరకు మందులు రోగులకు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో షాపుల యజమానులు పాల్గొన్నారు.

రేపు వాసవీమాత ఆత్మార్పణ దినం

చాగలమర్రి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు లక్ష్మణ బాబు తెలిపారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వాసవీ మహిళలచే లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే మూడురాళ్లపల్లె గ్రామంలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణ నక్షత్రం సందర్భంగా పల్లకి ఉత్సవం ప్రత్యేక పూజలు నిర్వహిం చనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కొలిమిగుండ్లలో కొండ ముచ్చు హల్‌చల్

- భయాందోళనతో ప్రజలు పరుగులు - బెడద నుంచి తప్పించాలని వేడుకోలు

కొలిమిగుండ్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : దారి తప్పి వచ్చిన ఓ కొండ ముచ్చు కోతి కొలిమిగుండ్లలో హల్ చల్ చేస్తోంది. దీంతో స్థానికులు భయాందోళనకు గురై పరుగులు తీస్తున్నారు. వారం రోజుల క్రితం సిమెంట్ ట్రాన్స్‌పోర్ట్ లారీలో కొలిమిగుండ్లకు చేరుకున్న ముచ్చు కోతి గ్రామంలోని జమ్మలమడుగు సర్కిల్‌లో నివాసం ఉంటున్న దుకాణాదారులు, ఇళ్లలోకి వెళ్లి భయపెడుతోంది. కోతి ఇళ్లలోకి, దుకాణాల్లోకి వచ్చి కూర్చొని గంటల తరబడి బయటకు వెళ్లడంలేదని, తామే ఇంటి నుంచి బయటి వచ్చి ఉంటున్నామని స్థానికులు వాపోతున్నారు. ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరచడంతో ప్రజలు మరింత భయపడుతున్నారు. కొందరు యువకులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి ముచ్చు కోతి బెడదను తప్పించాలని ప్రజలు కోరుతున్నారు.


ఇంటిపై కూర్చున్న కొండ ముచ్చు

జిల్లాకు 11 మద్యం షాపులు మంజూరు

కోవెలకుంట్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత కార్మికులకు నంద్యాల జిల్లాలో 11 మద్యం షాపులు మంజూరైనట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు తెలిపారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో నంద్యాల 1, నంద్యాల రూరల్ 1, జూపాడుబంగ్ల 1, పగిడాల 1, ఆళ్లగడ్డ 1, డోన్ 1, డోన్ రూరల్ 1, కొత్తపల్లె 1, పాములపాడు 1, ఉయ్యాలవాడ, ఆత్మకూరు 1 మద్యంషాపులు మంజూరయ్యాయన్నారు. ఈ షాపులకు దరఖాస్తు చేసుకునేవారు తహసీల్దారుతో కులధ్రువీకరణ పత్రం తీసుకోవాలన్నారు. వచ్చేనెల ఐదులోగా రూ.2లక్షలు డీడీ తీసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. లబ్ధిదారులు ఎలాంటి భయాందోళనకు గురికావద్దన్నారు. 26న పరిశీలన, 27న కలెక్టరు కార్యాలయంలో కలెక్టరు రాజకుమారి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ సమక్షంలో డ్రా ఉంటుందన్నారు. సమావేశంలో సర్కిల్ సీఐ బాషా, ఎస్సై సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నంద్యాల ఎక్సైజ్ శాఖ అడిషనల్ సూపరింటెండెంట్ రాముడు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- ఏపీఎం నాగమ్మ



చాగలమర్రి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఏపీఎం నాగమ్మ తెలిపారు. పొదుపు మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి వందశాతం లక్ష్యసాధనకు కృషి చేస్తున్నామని అన్నారు. బుధవారం ఏపీఎం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: మండలంలో పొదుపు సంఘాలు ఎన్ని ఉన్నాయి?

జవాబు: మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలో 1,015 పొదుపు సంఘాలు ఉన్నాయి.

ప్రశ్న: ఎన్ని పొదుపు గ్రూపులకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు ఇచ్చారు?

జవాబు: 2024-25 సంవత్సరానికి 472 పొదుపు గ్రూపులకు 14.72 కోట్లు బ్యాంకు లింకేజి ద్వార రుణాలు ఇచ్చాం.

ప్రశ్న: శ్రీనిధి కింద ఎంతమందికి రుణాలు ఇచ్చారు?

జవాబు: శ్రీనిధి కింద రుణాలు ఇవ్వలేదు. ఈ ఏడాది రూ.3 లక్షలు టార్గెట్ లక్ష్యంగా ఉంది. ఒక్కొక్కరికి వారు ఏర్పాటు చేసే యూనిట్ బట్టి రూ.50 వేలు వరకు ఇస్తున్నాం.

ప్రశ్న: సిబ్బంది కొరత ఉందా?

జవాబు: సిబ్బంది కొరత లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్వయం సిద్ధి పథకం ద్వారా 27 మందికి రుణ సాయం చేశాం. ఎనిమిది మంది వీవోఏలను కొత్తగా ఏర్పాటు చేశాం. ఐక్య సంఘాలను కూడా మార్పు చేసే అవకాశం ఉంది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బనగానపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రైతులు సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, రైతుశిక్షణా కేంద్రం అధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని టంగుటూరు, నందవరం, ఇల్లూరు కొత్తపేట, బనగానపల్లె గ్రామాలను సందర్శించి రైతులకు పలు పంటలపై సూచనలు సలహాలు అందించారు. పప్పుశనగలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజరు నరేంద్రకుమార్‌రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి రఘువరన్, రైతుసేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

శిరివెళ్ల, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో చేసిన పనులకు సంబంధించిన 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభను మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప బుధవారం తెలిపారు. ఏప్రిల్, 2023 నుంచి మార్చి, 2024 వరకు జరిగిన ఉపాధి పనులపై గ్రామస్థాయిలో తనిఖీలు చేసి సభలు సైతం నిర్వహించామన్నారు. తనిఖీ సిబ్బంది గ్రామాల్లో గుర్తించిన అవకతవకలు, లోపాలను మండలస్థాయిలో నిర్వహిస్తున్న చర్చా వేదికలో అధికారులు, ప్రజలకు తెలియజేస్తామన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చాగలమర్రి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్ బాషా తెలిపారు. బుధవారం చాగలమర్రి పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాన్ని, సూక్ష్మదర్శినిని ప్రారంభించారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య ఆధ్వర్యంలో ఏడీ వరప్రసాద్, పశువైద్యాధికారులు సాయిబాబా, దీపకుమారి పశువులు, గొర్రెలు, మేకలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, మాబుషరీఫ్, మౌలాలి, అనిఫ్, జెట్టి నాగరాజు, జల్సాగౌస్, సోను, అస్రఫ్, గఫార్, జిలేబి షరిఫ్, బీఎల్‌వోలు మురళీకృష్ణ, జమాల్‌వలి, వీఏలు కోటయ్య, తిరుపతయ్య వీహెచ్‌ఏలు, గోపాలమిత్ర సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

వెల్లాల క్షేత్రంలో బహిరంగ వేలం

చాగలమర్రి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించిన తలనీలాలు, టెంకాయల అంగడి, పూజా సామగ్రి, పచ్చి కొబ్బరి చిప్పలను పోగుచేసుకునే వేలం పాటలను ఈవో రమణ, చైర్మన్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వేలంలో టెంకాయల అంగడి రూ.5.30 లక్షలు, తలనీలాలు రూ.9.55 లక్షలు, పూజా సామగ్రి రూ.2.25 లక్షలు, పచ్చికొబ్బరి చిప్పల వేలం పాటలో రూ.40 వేలు వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్, వేలందారులు పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

చాగలమర్రి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి కొత్త ఎస్సీ కాలనీలో ప్రమాదవశాత్తు బుధవారం నిప్పంటు కొని గుడిసె దగ్ధమైంది. మద్దూరు అంకాలమ్మ గృహంలో ఒక్క సారిగా మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల ఉన్నవారు మంటల ను అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. టీవీ, వంట సామగ్రి, ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోయి రూ.లక్ష దాక ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితురాలు విలపించింది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ స్పందించి ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

బాలకృష్ణకు అవార్డు రావడంపై హర్షం

డోన్ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు ప్రకటించడంపై వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నందమూరి బాలకృష్ణ వివిధ రంగాల్లో చేసిన సేవలను గుర్తించి పద్మభూషణ్ అవార్డును ప్రకటించడం సంతోషకరమన్నారు.

బోరు నీరే శరణ్యం

- మినరల్ వాటర్ ప్లాంట్ లేక విద్యార్థుల పాట్లు
- పట్టించుకోని అధికారులు


ప్లాస్టిక్ క్యాన్లలో ఏర్పాటు చేసిన నీటిని తాగుతున్న విద్యార్థులు

చాగలమర్రి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబోదనం ఉన్నత పాఠశాలలో తాగు నీటి కోసం విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు 242 మంది విద్యార్థులు చదువుతున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ లేకపోవడంతో బోరు నీరే తాగాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. నాడు-నేడు కింద కొన్ని పాఠశాలలకు మాత్రమే మినరల్ వాటర్ ప్లాంట్‌లు మంజూరు చేశారని, తమ పాఠశాలకు ప్లాంట్ మంజూరు కాలేదని హెచ్ఎం కాత్యాయని తెలిపారు. వేసవి కాలంలో నీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.